ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ

ఊంజల్ సేవలో అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 18 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలో ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. శుక్రవారం అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాలు, వజ్రాభరణాలతో దివ్య మనోహరంగా అలంకరించిన అర్చకులు ఊంజల్ సేవలో తీర్చిదిద్ది తిరువీధుల్లో ఊరేగించారు. ప్రాకార మండపంలోని అద్దాల మండపంలో అమ్మవారి ఊంజల్ సేవను తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆస్థాన విధ్వాంసుల మంగళ వాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల నడుమ ఊంజల్ సేవతోత్సవం వైభవంగా సాగింది. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ లక్ష్మీనరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపి భక్తులకు నిజరూప దర్శనం కల్పించారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శ ఆళ్వారులను కొలుస్తూ సుదర్శన నారసింహ హోమం అత్యంత వైభవంగా జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్లను గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతు చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతు కొనసాగింది. సాయంత్రం స్వామివారిని గరుఢ వాహనంపై, అమ్మవారిని తిరుచ్చి వాహనంపై వేంచేపు చేసి వెండి మొక్కు జోడు సేవను నిర్వహించగా భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 7వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామి వారి ఖజానాకు రూ.12,65,043 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

పనిని దైవంగా భావించి పట్టుదలతో చేయాలి

- జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్, అదనపు జడ్జి చందన

జడ్జీలను సన్మానిస్తున్న రామన్నపేట బార్ అసోసియేషన్ న్యాయవాదులు

రామన్నపేట, అక్టోబర్ 18 : పనిని దైవంగా భావించి పట్టుదలతో కృషి చేయడం వల్ల మంచి ఫలితం సాధించవచ్చని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్, అదనపు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.చందన అన్నారు. సీనియర్ సివిల్ జడ్జీలుగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్లనున్న వారిని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కోర్టు సిబ్బంది, న్యాయవాదులు సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో తమకు ప్రతి ఒక్కరూ సహకరించడం వల్లే ప్రజల మన్ననలు పొందగలిగామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ మజీద్, సీనియర్ న్యాయవాదులు యాపాల కృష్ణారెడ్డి, కంపాటి యాదగిరి, జినుకల ప్రభాకర్, డి.నరేందర్‌రావు, ఉయ్యాల హన్మంతు, బి.అశోక్‌కుమార్, నకిరేకంటి మొగులయ్య, మామిడి వెంకట్‌రెడ్డి, పాల్వంచ జగతయ్య, డేవిడ్, బాలరాజు, యాదాసు యాదయ్య, శ్రీశైలం, దినేశ్, స్వామి, సూపరింటెండెంట్‌లు నారగోని గంగాభవాని, బాలగోని శివరాజు, ఎండీ మన్నాన్ పాల్గొన్నారు.

నేడు హైకోర్టు జడ్జీల రాక

రామన్నపేట, అక్టోబర్ 18 : రామన్నపేటకు కొత్తగా మంజూరైన సీనియర్ సివిల్ జడ్జి (సబ్ కోర్టు) కోర్టును శనివారం ప్రారంభించనున్నారు. ముఖ్య అతిథులుగా హైకోర్టు జడ్జీలు జువ్వాది శ్రీదేవి, కూనూరు లక్ష్మణ్ హాజరు కానున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ మజీద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు బదిలీ

భువనగిరి అర్బన్, అక్టోబర్ 18 : భువనగిరి కోర్టు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొంది జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా భువనగిరి ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వి.మాధవీలత జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా నియమింపబడ్డారు. శుక్రవారం వారిని భువనగిరి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.హరినాథ్, ఉపాధ్యక్షురాలు కె.జయ, కార్యదర్శి కృష్ణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణాలను కూల్చివేస్తాం

- భువనగిరి మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి

భువనగిరిలో ప్రహరీని కూల్చివేయిస్తున్న మున్సిపల్ సిబ్బంది

భువనగిరి అర్బన్, అక్టోబర్ 18 : మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి అన్నారు. పట్టణంలోని తాతానగర్ కాలనీలో అనుమతి లేకుండా నిర్మాణం చేపట్టిన ఇంటి ప్రహరీని శుక్రవారం మున్సిపల్ అధికారులు జేసీబీ సహాయంతో కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాతానగర్‌లో సర్వే నంబర్ 1065/ఏ, ప్లాట్ నంబర్ 15/1లో గల 216 గజాలలో అనుమతి లేకుండా నక్కల పద్మావతి ఆంజనేయులు ఇల్లు నిర్మించడంతో గతంలో నోటీసులు, స్పీకింగ్ ఆర్డర్ జారీ చేశామని, అయినా స్పందించకపోవడంతో కూల్చివేశామని అన్నారు. ఈ విషయంపై మొదటి హక్కుదారుడు తన స్థలాన్ని ఆక్రమించుకున్నారని, ఎందుకు కూల్చివేయడంలేదని కోర్టుకు వెళ్లారని, కోర్టు ఆదేశాల మేరకు ఇంటి ప్రహరీని కూల్చివేశామని చెప్పారు. పట్టణంలో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేయడంతోపాటు చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయంపై స్పందించిన నక్కల పద్మావతి ఆంజనేయులు తాము మహేశ్ అనే వ్యక్తి వద్ద ఆరు సంవత్సరాల క్రితం కొనుగోలు చేశామన్నారు. అందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు తమ వద్ద ఉన్నాయని, ఈ విషయం చెప్పినా మున్సిపల్ అధికారులు పట్టించుకోకుండా ప్రహరీని కూల్చివేశారని తెలిపారు. తమ వద్ద ఉన్న ఆధారాలతో న్యాయం కోసం పోరాడుతామని చెప్పారు.

యాదగిరిగుట్టలో అక్రమ కట్టడాల కూల్చివేత

అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చివేయిస్తున్న మున్సిపల్ అధికారులు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 18 : అనుమతులు లేకుండా మున్సిపాలిటీ భూముల్లో నిర్మించిన కట్టడాలను మున్సిపల్ అధికారులు శుక్రవారం కూల్చివేయించారు. యాదగిరిగుట్ట గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో గుండ్లపల్లి పరిధిలోని సర్వే నంబర్ 92లో సుమారు 3.10 ఎకరాల్లో ఓ రియల్ సంస్థ వెంచర్ చేపట్టింది. ఇందులో 10శాతం 310 గజాల భూమిని గ్రామపంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. కాగా, కొంతమంది స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కుమ్మక్కై 310 గజాల భూమిని కబ్జా చేసి నిర్మాణం చేపట్టారు. ఈ విషయాన్ని స్థానికులు మున్సిపల్ అధికారి దృష్టికి తీసుకురాగా శుక్రవారం కూల్చివేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్‌వీఎస్ కాటేజీ తదితర ప్రాంతాల్లో గ్రామపంచాయతీకి కేటాయించిన భూములను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని, వాటిని తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బీమా పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

బ్యాంకర్ల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 18 : బీమా పథకాలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బీమా పథకాలపై బ్యాంకర్లతో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15నుంచి వచ్చే ఏడాది జనవరి 15 వరకు మూడు నెలల పాటు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), ప్రధానమంత్రి సమృద్ధి బీమా యోజన (పీఎంఎస్‌బీవై) పథకాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. పీఎంఎస్‌బీవైలో 18నుంచి 70 ఏండ్ల వయస్సున్న వారు అర్హులని, ఏడాదికి రూ.20 ప్రీమియంతో ప్రమాద బీమా వర్తిస్తుందని అన్నారు. పీఎంజేజేబీవైలో రూ.436 వార్షిక ప్రీమియంతో అన్ని రకాల మరణాలకు బీమా వర్తిస్తుందని తెలిపారు. 18నుంచి 50ఏండ్ల మధ్య వయస్సులవారు ఈ పథకానికి అర్హులన్నారు. ఈ బీమా పథకాలను అన్ని బ్యాంకులు, తపాలా కార్యాలయాల నుంచి పొందవచ్చని తెలిపారు. సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ కె.శివరామకృష్ణ, పశుసంవర్ధక శాఖ అధికారి వి.కృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి సునందరెడ్డి, బ్యాంకు, నాబార్డ్, పోస్టల్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని, ఆయిల్‌పామ్ సాగుపై విస్తృతంగా ప్రచారాలు చేపట్టాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యానవన, ఆయిల్‌ఫెడ్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బెన్‌శాలోమ్, డీఏఓ గోపాల్, ఉద్యాన శాఖ అధికారి కె.సుభాషిణి పాల్గొన్నారు.

మానసిక ఆందోళన గల వ్యక్తులను గుర్తించాలి

మానసిక ఆందోళనలు, ఒత్తిడికి గురవుతున్న వ్యక్తులను గుర్తించి చికిత్స అందించాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. మానసిక ఆరోగ్య మాసోత్సవంలో భాగంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలకు మానసిక ఆరోగ్యంపై శుక్రవారం నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. మానసిక ఆందోళనలు ఉన్నవారికి సరైన సేవలు, హైపర్ టెన్షన్, డయాబెటిక్ పేషెంట్లను గుర్తించి మందులు అందేలా చూడాలన్నారు. 14416 టోల్ ఫ్రీ నెంబర్ ప్రతి ఒక్కరికీ తెలిసేలా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.యశోద మాట్లాడుతూ వైద్యాధికారులు తమ పరిధిలోని మానసిక ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. వారికి వైద్య చికిత్స ఇప్పించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. జిల్లా ఆసుపత్రిలోని సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రీతిస్వరూప్‌ను సంప్రదించి చికిత్స ఇప్పించాలని సూచించారు. అనంతరం అనీమియా ముక్త్ భారత్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రీతిస్వరూప్, సత్యేంద్రనాథ్, మనోహర్, రామకృష్ణ, శిల్పిని, సాయిశోభ, సుమన్ కళ్యాణ్, మరియమ్మ, ఇస్తారి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ఆకస్మిక తనిఖీ

గుండాల : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను కలెక్టర్ హనుమంతు కె.జెండగే ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించి బోధన పద్ధతుల గురించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. తాగునీరు, మౌలిక సదుపాయాలు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ జలకుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ రాము పాల్గొన్నారు.

సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దు

- అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్‌కు అఖిలపక్ష నాయకుల వినతి

అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్‌కు వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్షం నాయకులు

రామన్నపేట, అక్టోబర్ 18 : మండల కేంద్రం పరిధిలో ఏర్పాటు చేయనున్న అదానీ గ్రూప్ అంబుజా సిమెంట్ పరిశ్రమకు అనుమతులు ఇవ్వవద్దని అఖిలపక్ష నాయకులు కోరారు. ఈ మేరకు పర్యావరణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్‌కు, నల్లగొండలో కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయ ఇంజినీర్‌కు శుక్రవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ పర్యావరణం, ప్రజా ఆరోగ్యాన్ని దెబ్బతీసే పరిశ్రమ ఏర్పాటు చేస్తే 12 గ్రామాలకు చెందిన 30వేల ప్రజలు, పచ్చని పంట పొలాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జల, వాయు, శబ్ద కాలుష్యం తోపాటు ప్రజలకు నష్టం కలిగించే కాలుష్య పరిశ్రమను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశ్రమ యాజమాన్యం కాలుష్య నియంత్రణ మండలికి తప్పుడు సమాచారం అందించిందని, దీనిపై సమగ్ర విచారణ జరుపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ వేదిక కన్వీనర్ జెల్లెల పెంటయ్య, కో కన్వీనర్ ఎండీ రేహాన్, అఖిలపక్ష నాయకులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, పోశబోయిన మల్లేశం, ఊట్కూరి నర్సింహ, బొడ్డుపల్లి వెంకటేశం, పల్లపు దుర్గయ్య, ఫజల్ బేగ్, గోదాసు పృథ్వీరాజ్, నాగటి ఉపేందర్, మాడూరి ప్రభాకర్‌రావు, రమేశ్, ఎండీ జమీరొద్దీన్, మత్తయ్య, రాజు, హన్మంతు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

టీచర్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు శోభారాణి ఎంపిక

శోభారాణి

రాజాపేట, అక్టోబర్ 18 : మండలంలోని బొందుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు శోభారాణి టీచర్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో ఈ నెల 20న అవార్డు ప్రదానం చేయనున్నట్లు శారద ఎడ్యుకేషనల్ సొసైటీ వారు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శోభారాణికి పాఠశాల అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రామన్నపేట, అక్టోబర్ 18 : మూసీ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను రామన్నపేట పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. తుర్కపల్లి గ్రామ శివారులోని మూసీ వాగు నుంచి ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు కక్కిరేణి గ్రామ శివారులో తనిఖీ నిర్వహించగా అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నారు. పారిపోవడానికి ప్రయత్నించిన డ్రైవర్లను పట్టుకున్నారు. ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి, డ్రైవర్లతో పాటు ట్రాక్టర్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

తుర్కపల్లి, అక్టోబర్ 18 : మండల కేంద్రంలో పేకాట స్థావరంపై ఎస్ఐ తకియొద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. మండల కేంద్రానికి చెందిన ఐదుగురు యువకులు పేకాట ఆడుతుండగా పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 6వేల నగదుతోపాటు రెండు మోటార్ సైకిళ్లు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

హామీలను నెరవేర్చాలి : సీపీఐ

వలిగొండ, అక్టోబర్ 18 : ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ మండల కార్యదర్శి పోలెపాక యాదయ్య డిమాండ్ చేశారు. మండలంలోని దుప్పెల్లి, గోపరాజుపల్లి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. నాయకులు సుదర్శన్, వీరస్వామి, మాణిక్యం, మహేశ్, లక్ష్మీనారాయణ, యాదయ్య, సత్యనారాయణ, నర్సింహ, సుధాకర్, రాము పాల్గొన్నారు.

నేతన్నల కుటుంబాలను ఆదుకుంటాం

శివకుమార్ కుటుంబానికి బియ్యం అందిస్తున్న పద్మశాలీ చేయూత సభ్యులు

ఆలేరు టౌన్, అక్టోబర్ 18 : నేతన్నల కుటుంబాలకు చేయూత అందించి ఆదుకుంటామని పద్మశాలీ చేయూత సభ్యులు చిక్కశ్రవణ్‌కుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని క్రాంతినగర్ కాలనీకి చెందిన చింతకింది శివకుమార్ ఇటీవల మృతిచెందారు. ఆయన కుటుంబాన్ని చేయూత సభ్యులు శుక్రవారం పరామర్శించి ప్రగాఢ సానూభూతి తెలిపారు. 50కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలీ చేయూత సభ్యులు డాక్టర్ చింతకింది మురహరి, సీహెచ్ వెంకటయ్య, వంగరి శివకుమార్, సీహెచ్ వెంకటేశ్, గజ్జెల రమేశ్, బేతి బాలరాజు, ఎన్నం సోమరాజు, ఎలగందు దయాకర్, చింతికింది బాలరాజు, చింతకింది కృష్ణ, సిద్ధేశ్వర్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి : పీడీఎస్‌యూ

సన్నాహక సభలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ శ్రీకాంత్

ఆలేరు టౌన్, అక్టోబర్ 18 : విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు ఎస్‌వీ శ్రీకాంత్, గడ్డం నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అర్ధశతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆలేరులోని దినేశ్ గార్డెన్స్‌లో శుక్రవారం సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీలో జార్జిరెడ్డి స్థాపించిన పీడీఎస్‌యూ లక్ష్యాల సాధనలో జంపాల చంద్రశేఖర ప్రసాద్, రంగవల్లి, మారోజు వీరన్న, కొలను పాక ప్రాంతానికి చెందిన కోలా శంకర్ వంటి ఎందరో అమరవీరులయ్యారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను గాలికి వదిలేసిందని విమర్శించారు. గురుకుల హాస్టళ్లకు అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు హాస్టళ్లకు తాళాలు వేస్తే విద్యార్థులు రోడ్డున పడే పరిస్థితి దాపురించిందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 7శాతం నిధులు కేటాయించి విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ఈ నెల 24న ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే రాష్ట్ర స్థాయి అర్ధ శతాబ్ది ఉత్సవ సభకు విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శులు ఆర్.జనార్దన్, ఎం.భిక్షపతి, పూర్వ అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం నాగరాజు, బేజాడి కుమార్, సహదేవ్, నాయకులు పూల నాగయ్య, కడకంచి కిష్టయ్య, సోమరాజు, సిద్ధులు, శ్రీనివాస్, శివ, కుమారస్వామి, బాలకృష్ణ, మహేశ్, కృష్ణ, మధు, బీరయ్య పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులపై అధికారుల బెదిరింపులు ఆపాలి : సీఐటీయూ

మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు, కమిషనర్ రామానుజులరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికులు

భువనగిరి అర్బన్, అక్టోబర్ 18 : పట్టణంలో పారిశుధ్య కార్మికులపై అధికారుల బెదిరింపులు ఆపాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు, కమిషనర్ రామానుజులరెడ్డికి మున్సిపల్ కార్మికులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ మాట్లాడుతూ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఐదు సంవత్సరాల నుంచి ఇక్కడే ఉంటూ కార్మికులను బెదిరిస్తున్నారన్నారు. కార్మికులు ఉదయం 5గంటల నుంచి కష్టపడి పని చేస్తుంటే అధికారులు, జవాన్లు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు నాలుగు సార్లు హాజరు ఇవ్వాలని ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. నూనె, సేఫ్టీ షూస్ ఇస్తున్నట్లు ఫొటో తీసుకొని రిటర్న్ తీసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్నవి కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు బట్టు కొండయ్య, మంజుల, శాంతమ్మ, సత్తెమ్మ, బాలనర్సింహ, రాజలింగం, శంకర్, యాదమ్మ పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు విఫలం : ఏఐవైఎఫ్

వలిగొండ, అక్టోబర్ 18 : యువతకు ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లలకి మహేశ్ అన్నారు. మండలంలోని దుప్పెల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సంఘం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఈ నెల 27, 28 తేదీల్లో పెద్దపల్లి, గోదావరిఖనిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సుద్దాల సాయికుమార్, షాబుద్దీన్, దేవేందర్, నర్సింహాచారి, లక్ష్మీనారాయణ, పృథ్వీ, వీరస్వామి, ఐలేశ్ పాల్గొన్నారు.

గొలుసుకట్టు చెరువులు నింపుతాం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

జంగంపల్లి కాల్వను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట, అక్టోబర్ 18 : బస్వాపూర్ డిస్ట్రిబ్యూటరీ కాల్వ ద్వారా యాదగిరిగుట్ట, మోటకొండూర్, ఆత్మకూరు(ఎం) మండలాల గొలుసుకట్టు చెరువులను నింపేందుకు కృషి చేస్తామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండలంలోని జంగంపల్లి, దాతారుపల్లి కాల్వలను శుక్రవారం ఆయన పరిశీలించారు. జంగంపల్లి వద్ద డిస్ట్రిబ్యూషన్ పాయింట్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంగంపల్లి డిస్ట్రిబ్యూషన్ పాయింట్ ఏర్పాటుతో దాతారుపల్లి, రాళ్లజనగాం, గొల్లగుడిసెలు, యాదగిరిగుట్ట, వంగపల్లి, చొల్లేరు, మహబూబ్‌పేట గ్రామం నుంచి మోటకొండూర్‌లోని బిక్కేరు వాగు వరకు గొలుసుకట్టు కాల్వలతో గోదావరి జలాలను పంపిణీ చేసే వీలుందన్నారు. అనంతరం తుర్కపల్లి మండలం సంగ్యాతండాలోని తోక చెరువులోకి నీటిని నింపే పైప్‌లైన్‌ను పరిశీలించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ డైరక్టర్లు శివరాత్రి దానయ్య, పాండురంగయ్య, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కానుగు బాలరాజుగౌడ్, మాజీ ఉప సర్పంచ్ గుండ్లపల్లి భరత్‌గౌడ్ ఉన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

జానకిపురం బిక్కేరు వాగులో గోదావరి జలాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

అడ్డగూడూరు, అక్టోబర్ 18 : రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని జానకిపురం గ్రామ బిక్కేరు వాగు చెక్‌డ్యామ్‌లోకి చేరిన గోదావరి జలాలకు శుక్రవారం ఆయన పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తిరుమలగిరిలో ఇంటిగ్రేటేడ్ పాఠశాల మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బిక్కేరు వాగులో 5 చెక్‌డ్యామ్‌లు నిర్మించారని, వాటి ద్వారా 25 గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. మోత్కూరు మండలానికి బస్ డిపో, డిగ్రీ కళాశాల మంజూరుకు కృషి చేస్తానని చెప్పారు. అడ్డగూడూరు మండలంలో ఐటీఐ కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సింగిల్‌విండో చైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పోలెబోయిన లింగయ్య యాదవ్, నాయకులు చిరంజీవి, స